డేటా సెంటర్లతో పర్యావరణానికి ముప్పు

ఢిల్లీ సైన్స్ ఫోరం ఫౌండర్ రఘునందన్

తాటిచెట్లపాలెం: గూగుల్ డేటా సెంటర్ల వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు పొంచివుందని ఢిల్లీ సైన్స్ ఫోరం ఫౌండర్, ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ జాతీయ నాయకులు డి.రఘునందన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు వీటిని వ్యతిరేకిస్తుంటే, మన దేశంలో ప్రభుత్వాలే ఆహ్వానించడం ప్రమాదకరమన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం దొండపర్తిలోని ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ సెమినార్ హాల్‌లో 'డేటా సెంటర్లు –విశాఖ పర్యావరణంపై ప్రభావం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా విచ్చేసిన రఘునందన్ మాట్లాడుతూ.. అమెరికా, ఐరోపా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రజల వ్యతిరేకత వల్లే ఇవి ఏర్పాటు కాలేదన్నారు. వీటి వల్ల భారీగా నీరు, విద్యుత్ వినియోగంతో పాటు రేడియేషన్ సమస్యలు ఉత్పన్నమవుతాయని పేర్కొన్నారు. అలాగే మన డేటాపై విదేశీ నియంత్రణ ఉండి, పారదర్శకత ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం వాస్తవాలను మభ్యపెడుతూ 1 గిగాకు బదులు మూడు ప్రాంతాల్లో సుమారు 2.5 గిగా డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తోందని ఆరోపించారు. విశాఖలోని సింహాచలం, ఆనందపురం వంటి నివాస ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవన్నారు. వీటిపై విద్యార్థులు, మేధావులు, ప్రజాసంఘాల సహకారంతో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి జి.మురళీధర్, రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, హెల్త్ సబ్ కమిటీ రాష్ట్ర కో–కన్వీనర్ డాక్టర్ ఎం.రమేష్‌కుమార్, ఎన్.చంద్రశేఖర్, మానవ హక్కుల వేదిక అధ్యక్షులు వీఎస్ కృష్ణ, ప్రతినిధులు త్రినాథరావు, కామేశ్వర్రావు, జీవీ రమణ, పెద్ద సంఖ్యలో పర్యావరణ వేత్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రఘునందన్

ఆన్‌లైన్ పరిచయం..ఆఫ్‌లైన్ దొంగతనం

- నమ్మి తాళాలిస్తే ఆరు తులాల బంగారు ఆభరణాలు, ఫోన్లతో ఉడాయించిన కేటుగాడు
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

ఆరిలోవ: సోషల్ మీడియా పరిచయం కాస్తా ఓ మహిళ కొంపముంచింది. నమ్మి ఇంటి తాళాలు ఇస్తే.. ఆ నమ్మకాన్ని వమ్ము చేస్తూ ఆరు తులాల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లతో ఉడాయించిన కేటుగాడిని ఆరిలోవ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి దొంగిలించిన సొత్తును రికవరీ చేశారు. క్రైం ఎస్.ఐ. హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..

జీవీఎంసీ 13వ వార్డు పరిధిలోని శ్రీకృష్ణాపురంలో నివాసముంటున్న గుండరెడ్డి సుమలతకు, 'పీర్ దాబ్' యాప్ ద్వారా తెలంగాణ రాష్ట్రం, మహబూబాబాద్ జిల్లా బయ్యారానికి చెందిన కృష్ణరెడ్డి అనే వ్యక్తితో కొన్ని నెలల క్రితం పరిచయమేర్పడింది. ఆ పరిచయంతో ఈ ఏడాది ఫిబ్రవరి 15వ తేదీ ఉదయం కృష్ణరెడ్డి తన ఊరి నుంచి శ్రీకృష్ణాపురంలోని సుమలత ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో సుమలత తన కూతురితో కలిసి స్థానిక శివాలయానికి వెళ్లేందుకు సిద్ధమవుతోంది. పరిచయస్తుడే కదా అని నమ్మిన ఆమె.. తాము గుడికి వెళ్లి తిరిగి వచ్చేవరకు ఇంట్లోనే ఉండమని కృష్ణరెడ్డికి ఇంటి తాళాలు ఇచ్చి వెళ్లింది. అయితే ఇదే అదనుగా భావించిన నిందితుడు ఇంట్లో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లను దొంగిలించాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు, వెంటనే నిందితుడు కూడా ఆ శివాలయం వద్దకు వెళ్లి.. 'నాకు అర్ధాంతరంగా పని పడింది, ఊరు వెళ్తున్నాను' అని చెబుతూ సుమలతకు తాళాలు ఇచ్చేసి అక్కడ నుంచి జారుకున్నాడు. ఆ తర్వాత సుమలత ఇంటికి వచ్చి చూడగా.. బీరువాలో ఉండాల్సిన ఆరు తులాల బంగారు వస్తువులు, రెండు సెల్‌ఫోన్లు మాయమవ్వడంతో షాక్‌కు గురైంది. కృష్ణరెడ్డే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటాడని గ్రహించిన బాధితురాలు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడి కదలికలను కనిపెట్టి, గురువారం అతనిని అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి దొంగిలించిన రెండు ఫోన్లు, ఆరు తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ. హరికృష్ణ వెల్లడించారు.

లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా గ్యాస్ సిలిండర్ల సరఫరా

మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

మహారాణిపేట: వినియోగదారులు బుకింగ్ చేసిన తర్వాత నిర్ణీత వ్యవధిలోనే ఓటీపీ ఆధారిత డెలివరీ ద్వారా గ్యాస్ సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్‌పీజీ డీలర్లు, హెచ్‌పీసీఎల్, ఐఓసీ, బీపీసీఎల్ సేల్స్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. సిలిండర్ల డెలివరీలో ఎక్కడా జాప్యం జరగకూడదని, పెండింగ్ బుకింగ్‌లను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా 'దీపం–2' పథకం లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరఫరా సక్రమంగా సాగాలన్నారు. డెలివరీ సిబ్బంది ప్రవర్తన, వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై అధికారులతో చర్చించారు. సమావేశంలో డీఎస్‌వో వి.భాస్కరరావు, ఏఎస్‌వోలు శ్రీహరి, రుక్మిణి కళ్యాణి, పలు కంపెనీల సేల్స్ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

విశాఖ-ఇచ్ఛాపురం సెక్షన్‌లో జీఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ గురువారం విశాఖ– ఇచ్ఛాపురం సెక్షన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇన్ఫ్రాస్ట్రక్చర్, ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా ప్రమాణాలను ఆయన పరిశీలించారు. అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన సింహాచలం రైల్వే స్టేషన్‌తో పాటు కొత్తవలస, శ్రీకాకుళం రోడ్, నౌపడ, పలాస స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించిన ఆయన.. నిర్దేశిత సమయానికి పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇచ్ఛాపురం– విశాఖ మధ్య విండో ట్రైలింగ్ ఇన్‌స్పెక్షన్ ద్వారా రైల్వే ట్రాక్స్, సిగ్నలింగ్ వ్యవస్థ, బ్రిడ్జిలను పరిశీలించి, ప్రజా సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ పర్యటనలో ప్రిన్సిపాల్ చీఫ్ ఇంజనీర్ బి.ఎస్.కె. రాజ్‌కుమార్, పీసీఎస్‌టీఈ ఓబీ సురేష్‌కుమార్, పీసీవోఎం వినీత్ కుమార్, సీఏవో అంకుష్ గుప్తా, డీఆర్ఎం లలిత్ బోహ్రా తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో)	
ఫారం ధర	: రూ.115
బ్రాయిలర్ (లైవ్)	: రూ.135
స్కిన్	: రూ.240
స్కిన్‌లెస్	: రూ.250

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)	
విశాఖ	540.00
విజయనగరం	544.00
శ్రీకాకుళం	544.00

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

అల్లిపురం: ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ బందోబస్తు విధులు నిర్వహించాలని నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. నగర పోలీసు కమిషనరేట్ సమావేశ మందిరంలో డీసీపీ–1, డీసీపీ–2, డీసీపీ క్రైమ్స్, ట్రాఫిక్ అధికారులు, ఏడీసీపీలు, ఏసీపీలు, సంబంధిత సీఐలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి, గవర్నర్, మంత్రులు, ఇతర ప్రముఖులు పర్యటించే ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి తాగునీరు, మజ్జిగ, భోజనం సమయానికి అందేలా చూడాలని ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా వడదెబ్బ నివారణ కోసం వోఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే ప్రతి శుక్రవారం నిర్వహించే 'నో వెహికల్ డే'లో భాగంగా ముఖ్యమంత్రి ఏయూ హెలిప్యాడ్ నుంచి నోవాటెల్ వరకు సైకిల్‌పై వెళ్లి భద్రతా చర్యలను సమీక్షించారు.

సైకిల్‌తో పర్యటిస్తున్న సీపీ బాగ్చి

బిల్డింగ్ ప్లాన్లు, ఎల్ఆర్ఎస్ మంజూరుపై ప్రత్యేక శ్రద్ధ

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశం

డాబాగార్డెన్స్ : నగర పరిధిలో భవన నిర్మాణ అనుమతులు, ఎల్ఆర్ఎస్, టీడీఆర్‌ల మంజూరులో ఎలాంటి జాప్యం లేకుండా.. నిర్ణీత గడువులోపు ప్రక్రియ పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావుతో పాటు ఇతర టౌన్ ప్లానింగ్ అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలు భవన నిర్మాణ అనుమతుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు సమర్పిస్తున్నప్పటికీ వాటి పరిష్కారంలో అనవసర జాప్యం జరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్ పథకం కింద వచ్చిన దరఖాస్తుల పరిశీలన, మంజూరు ప్రక్రియలో కూడా నిర్లక్ష్యం కనిపిస్తోందని పేర్కొన్నారు. ఏపీ డీపీఎంఎస్ పోర్టల్‌లో నమోదైన భవన నిర్మాణ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, రెండు రోజుల కంటే ఎక్కువ ఆలస్యం చేయకుండా సంబంధిత ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విషయంలోనూ క్షేత్రస్థాయి పరిశీలన త్వరితగతిన పూర్తి చేసి, జాప్యం లేకుండా నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ అనుమతుల నమోదు ప్రక్రియలోనూ లోపాలు, ఆలస్యాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్లు మధుసూధనరావు, రామ్మోహన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు తిరుపతిరావు, రామలింగేశ్వరరెడ్డి, ఝాన్సీ, లక్ష్మీ షబ్నం, శాస్త్రి, రామకృష్ణ, టీపీవోలు, టీపీబీవోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

పొట్టలో 4.5 కిలోల కణితి తొలగింపు

మహారాణిపేట: కేజీహెచ్‌లో వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. విజయనగరం జిల్లాకు చెందిన టి.రజిని గత ఏడాది కాలంగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ గత నెల 14న కేజీహెచ్ యూరాలజీ విభాగంలో చేరారు. పరీక్షల అనంతరం ఆమె కడుపులోని అడ్రినల్ గ్రంథిలో కుడివైపు 6 సెం.మీ, ఎడమవైపు 28 సెం.మీ మేర కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. లక్ష మందిలో నలుగురికి మాత్రమే వచ్చే 'బైలాటరల్ అడ్రినల్ మైలోలిపోమా విత్ కంజెనిటల్ అడ్రినల్ హైపర్‌ప్లాసియా' అనే అరుదైన వ్యాధిగా దీనిని నిర్ధారించారు. యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో, ఎండోక్రినాలజీ, అనస్తీషియా విభాగాల సహకారంతో గత నెల 19న రజనికి శస్త్రచికిత్స చేసి కడుపులో ఉన్న 4.5 కిలోల భారీ కణితను విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో గురువారం డిశ్చార్జ్ చేసినట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. విజయవంతంగా శస్త్రచికిత్స చేసిన డాక్టర్ చంద్రశేఖర్, అనస్తీషియా వైద్యులు కె.శ్రీలక్ష్మి, శరత్ చంద్ర, అప్పలరాజు, వెంకటకృష్ణ, దత్తాత్రేయ బృందాన్ని సూపరింటిండెంట్ అభినందించారు.



రోగితో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, వైద్య బృందం

బాలల కేసుల్లో సున్నితంగా వ్యవహరించాలి

ఎంవీపీకాలనీ: బాలల కేసుల్లో అధికారులు, పోలీసులు సున్నితమైన దృక్పథంతో వ్యవహరించాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు పేర్కొన్నారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బేటీ బచావో–బేటీ పడావో' పథకంలో భాగంగా జువెనైల్ జస్టిస్, పోక్సో చట్టాలపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం జరిగింది. ఎంబీపీ కాలనీలోని డీఆర్‌డీఏ భవనంలో నిర్వహించిన ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సన్యాసి నాయుడు మాట్లాడుతూ.. బాలలపై నమోదవుతున్న కేసుల దర్యాప్తులో పోలీసులు, వారికి పునరావాసం కల్పించే విషయంలో అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించాలన్నారు. పిల్లల విలువైన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చట్టపరమైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరిన్ని నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్. రాధ, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యుడు పి.సూర్యభాస్కర్ తదితరులు చట్టాలు, కేసుల విచారణ తీరు, వివిధ నేరాలకు అమలులో ఉన్న శిక్షలపై అవగాహన కల్పించారు. సదస్సులో ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి, డీసీపీవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం 2.30 గంటల వరకు అంతరాలయ దర్శనాలు బంద్

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అంతరాలయ దర్శనాలు ప్రతి శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 2.30 గంటల వరకు లభించవని ఈవో జె.వెంకటరావు తెలిపారు. ఆయా రోజుల్లో అంతరాలయంలో మూడు విడతలుగా జరిగే స్వర్ణపుష్పార్చన కారణంగా ఈ మార్పు చేసినట్టు పేర్కొన్నారు.

సిటీ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధే ధ్యేయం

వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులతో సమీక్షిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

డాబాగార్డెన్స్: సిటీ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధే ధ్యేయంగా నగర పరిధిలోని పలు ప్రాజెక్టులపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో జరిగిన ఈ సమావేశంలో వరల్డ్ బ్యాంక్ ప్రతినిధి అభిజిత్‌రేతో కూడిన ముగ్గురు సభ్యుల బృందం పాల్గొంది. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్‌గార్గ్ జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద చేపట్టిన ప్రాజెక్టులతో పాటు ఇతర ప్రతిపాదిత ప్రాజెక్ట్‌ల వివరాలను వారికి వివరించారు. విశాఖ ఎకనామిక్ రీజన్ అభివృద్ధిలో భాగంగా నగర భౌగోళిక పరిస్థితులు, అవసరాలపై వరల్డ్‌బ్యాంక్ ప్రతినిధుల బృందానికి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కమిషనర్ సమగ్రంగా వివరించారు. నగరంలో నీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థ, రోడ్ల విస్తరణ, మొబిలిటీ కారిడార్స్, రోడ్డు కనెక్టివిటీ పెంపుదల, హౌసింగ్, మురికివాడల అభివృద్ధి తదితర మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ప్రాజెక్టుల రూపకల్పనపై ఈ ప్రజంటేషన్‌లో చర్చించారు. ఈ ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాల అధ్యయనంలో భాగంగా శుక్రవారం వరల్డ్ బ్యాంకు ప్రతినిధుల బృందం నగరంలోని పలు ప్రాంతాలలో క్షేత్రస్థాయి పర్యటన చేసి పరిశీలించనుందని కమిషనర్ తెలిపారు. సమీక్షా సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, ప్రధాన ఇంజినీరు పీవీవీ సత్యనారాయణరాజు, పర్యవేక్షక ఇంజినీరు ఏడుకొండలు, అడ్వైజర్ కేవీఎన్ రవి, స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ మేనేజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



మరికొంత కాలం ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తాటిచెట్లపాలెం: వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం నడుస్తున్న పలు వీక్లీ స్పెషల్ రైళ్ల సేవలను మరికొంత కాలం పొడిగించినట్లు సౌత్ కోస్ట్ రైల్వే విశాఖ డివిజన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ వై. బాలాజీ కిరణ్ తెలిపారు. సికింద్రాబాద్–నహర్‌లగున్ మధ్య నడిచే 07046 వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 25 వరకు, తిరుగు ప్రయాణంలోని 07047 నహర్‌లగున్– సికింద్రాబాద్ వీక్లీ స్పెషల్‌ను సెప్టెంబర్ 28 వరకు పొడిగించారు. ఈ రైలు ప్రతి శుక్రవారం సికింద్రాబాద్‌లో బయల్దేరి దువ్వాడ మీదుగా నహర్‌లగున్ చేరుకోగా, తిరుగు ప్రయాణంలో ప్రతి సోమవారం నహర్‌లగున్ నుంచి బయల్దేరి గురువారం సికింద్రాబాద్ చేరుకుంటుంది. అదేవిధంగా చర్లపల్లి–సంత్రగచ్చి మధ్య నడిచే 07221 వీక్లీ స్పెషల్ రైలును సెప్టెంబర్ 26 వరకు, తిరుగు ప్రయాణంలోని 07222 సంత్రగచ్చి–చర్లపల్లి వీక్లీ స్పెషల్‌ను సెప్టెంబర్ 27 వరకు కొనసాగించనున్నారు. ఈ రైళ్లు దువ్వాడ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. ఇక గౌహతి–బెంగళూరు మధ్య ప్రత్యేక సమ్మర్ స్పెషల్ రైళ్లు కూడా నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 05642 గౌహతి–బెంగళూరు సమ్మర్ స్పెషల్ జూన్ 6న గౌహతి నుంచి బయల్దేరి జూన్ 8న బెంగళూరు చేరుకోనుండగా, 05641 బెంగళూరు–గౌహతి సమ్మర్ స్పెషల్ జూన్ 9న బెంగళూరు నుంచి బయల్దేరి జూన్ 11న గౌహతి చేరుకుంటుంది. ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్లను వినియోగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

భలేభలే పాపకార్న్

ఎండలు మండిపోతుంటే జనాలు రకరకాల ఐడియాలతో రోడ్లపైకి వస్తున్నారు. కొందరు గొడుగులు పడితే, మరికొందరు స్కార్ఫ్‌లు కడుతున్నారు. కానీ.. ఈ బుజ్జాయి మాత్రం రూటే మార్చేసింది.. 'హెల్మెట్ పెట్టుకుంటే నా అందం ఎవరికీ కనిపించదు.. అదే ఈ బకెట్ నెత్తిన పెడితే ఊరంతా నన్నే చూస్తుంది' అన్నట్టుగా.. తలపై ఒక ఖాళీ 'పాప్‌కార్న్ బకెట్' బోర్లించి భలే గమ్మత్తుగా ప్రయాణించింది. దొండపర్తి రోడ్డులో వెళ్తున్న వాహనదారులను, పాదచారులను ఇట్టే ఆకట్టుకున్న ఈ చిన్నారి ఫన్నీ లుక్‌ను 'సాక్షి' తన కెమెరాలో క్లిక్ మనిపించింది.

– అల్లిపురం

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **DUKKA BALARAM SRINIVAS** S/o. Dukka Bangaru Raju, Previously called as **DUKKA SRINIVASA RAO,** D.No. 54-4-21, Sivalayam Street, Near Sivalayam Temple, Isukathota, Visakhapatnam-530022, Andhra Pradesh. Now changed my Name from **DUKKA SRINIVASA RAO** (Old Name) to **DUKKA BALARAM SRINIVAS** (New Name), henceforth I will be called as **DUKKA BALARAM SRINIVAS** for all purposes.

DOCUMENTS LOST

I, **BODDETI RAJ KUMAR** S/o. Boddeti Suryanarayana, residing at D.No. 58-45-3/5, Gavara Street, Butchirajupalem, NAD Junction, Visakhapatnam - 530027. I have lost my original Certificates SSC, TC and Study Certificate, PUC, Marks Memo, B.A, TC, Studay Certificate, PG and B.Ed Certificate, TC. While Traveling from NAD Junction to Baji Junction. on 22-05-2026. If anybody found Please Contact : **79816 77836**

CHANGE OF NAME

I, Atte Naga Jyothi, D/o. A. Tirupathi Reddy, R/at D.No.45-47-22/3, Flat No.405, Vaishaki Royal Apartments, 80 feet Road, Akkayyapalem, Visakhapatnam-530016, Andhra Pradesh. Now changed my name from **SILLA NAGA JYOTHI** (Old Name) to **ATTE NAGA JYOTHI** (New Name). Shall henceforth be known called as **ATTE NAGA JYOTHI** (New Name) for all purpose.

పోయినది

నేను చుట్టుగుల్ల మోనిషా D/o. రవి కుమార్ ఎన్. రావు, H.No 310, గ్రీన్ మెడోస్, సబ్‌స్టేషన్ రోడ్, మాధవధార, విశాఖపట్నం – 530018. నారాయణ కాన్వెంట్ స్కూల్‌కు చెందిన **SSC మార్క్స్ మెమో** (హాల్ టికెట్ నం. 1338107981) బెంగళూరు నుండి విశాఖపట్నం మారే సమయంలో పోయింది. 14-10-2025న గుర్తించాను. దొరికినవారు సంప్రదించగలరు. ఫోన్ : 93904 41935

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :– బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :– 98484 88068/ 77992 23300 [V- 15331]

క్రికెట్ గురించి తాజా సమాచారానికి, రచనలకు www.sakshi.com సాక్షి స్పోర్ట్స్

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Wanted

■ ఆయా (Aaya) కావలెను : స్కూల్‌లో పనిచేయుటకు 50 సంవత్సరాల లోపు గల ఆడమనిషి కావలెను. N.T. స్కూల్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16, సెల్: 99590 94720, 93987 09459. [V- 2968]

■ **Wanted Teachers Full Time** 2nd Std. English & EVS, 1st to 8th Computers, 5th to 8th English Grammar, Evening 4:30 to 7pm Tutors Wonworld School, Lawsonsbay Colony, Pedawaltair (Behind Baba Bazar). Ph : 98482 37187, 82351 23123 [V- 15591]

సాక్షి క్లాసిఫైడ్స్

లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 525/- అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కాలన